# పున్నమి మసకలు



"సామగానప్రియ స్సర్వ
రక్షక స్సాగరోద్భవః,
భయాన్తకృ ద్భక్తిగమ్యో
భవబంధవిమోచకః,
జగత్ప్రకాశకిరణో
జగదానందకారణః— (చంద్ర స్తో.)

ఆరాత్రి నిండు పౌర్ణమి. చుట్టూ కారు చీకటి. ఉరుములూ మెరుపులతో కుంభవృష్టి. పల్లెటూరేమో, పెందలాడే భోజనాలయినాయి. పళ్లెంలో ఆకులూ వక్కలూ ఉన్నాయి. తాంబూలాలు వేసుకుంటున్నాం. జనార్దనయ్యగారు ఆ చావిట్లోనే, చుట్ట కాలుస్తూ పడక కుర్చీలో కూచున్నారు.

"పున్నమి గడియలు దాటేవరకూ ఈముసురు ఆగదమ్మా. ఆ వెనకనే బండి కట్టిస్తా. నేను కూడా వచ్చి రైలువద్ద దిగబెడతా. అంతవరకూ సంతోషంగా ఇక్కడే ఉండండి. మీ బస్తీ కబుర్లూ, కాలేజీ కబుర్లూ చెబుతూండండి. మేం వింటూంటాం" అన్నారు రెండు నాళ్ళకు ముందు, జనార్దనయ్యగారు.

శారదాంబగారు కూడా చాలా సంస్కారంగల మనిషని పేరు — వాళ్ళ పుట్టింట్లో, అంటే మా ఊళ్లో, మాకు ఆ వృద్ధ దంపతులతో పల్లెటూరులో కాలం గడపడం ఏమీ కష్టంగా లేదు. పైగా ప్రతి నిమిషమూ అనుభవంతోనూ, ఆనందంతోనూ గడిచేది. ఆవిడా భోజనం చేసుకుని మాతో వచ్చి కలిశారు. అందరమూ ప్రశాంతిగా కూచుని పిచ్చాపాటీ చెప్పుకుంటున్నాం. కాస్సేపటికి మాకు మాటలాగినయి.

గది దీపం వెలుగులో, గుమ్మంలో తెరకట్టినట్టూ వర్షపుధారలు, కొంచెం మేర ఒక వరస కనబడుతున్నాయి — పైనించీ క్రిందికి జారుతూ, భూమిమీదికి. మాకు ఎదురుంగా దేవుడిగదిలో దీపం కనిస్తూంది. గాలికి అటూ ఇటూ ఒరిగి కూడా పైకిచూస్తూ నిలబడి వెలుగుతూంది — అగ్నినాలుకలా. ఎదుగుతూన్న పచ్చని మువ్వాకులూ, ఎగరబోతున్న పక్షులూ వికసించిన పువ్వులూ, అన్నీ పైకే చూస్తాయి. పైకి సూర్యుడికేసి, ఆకాశంవేపు, భగవంతుని వైపేమో ననిపించింది.

బయట వర్షం తగ్గింది. ఉన్నట్టుండి కళ్ళు చెదరేటట్టూ ఒక్క మెరుపు మెరిసింది ఆకాశం

కొడుకుపుట్టాలని కోరుకొంటారు. కొడుకు మోక్షద్వారాలు తెరిపిస్తాడని నమ్ముతారు. శ్రద్ధ చూపుతారు. ఒకఅయ్య చేతిలో పెట్టేవరకే కూతురు. తండ్రికి ఏమీకాదు. కాని తండ్రి కన్నీరు చూడగల కుమార్తె ఉండదేమో? తల్లీ తండ్రీ తానే అయిపెంచిన తండ్రి అంటే మరీను.

మీద. మా కెదురుంగా బయట, గుమ్మంతో నుంచీ కనబడే కలువగుంట తెరిపిలో అప్పుడే మబ్బులలోనుంచీ విడిన చంద్రుడు ప్రతిబింబిస్తున్నాడు. గుంట గట్టుమీద, గుంటకు అటుప్రక్క ఇంటికీ గుంటకీ మధ్య, ఒక నడివయస్సు స్త్రీమూర్తి, పైకి, ఆకాశంవైపు తలెత్తి, చంద్రుడికి దణ్ణం పెడుతూ నిలుచుని ఉంది. ఈ అపూర్వ దృశ్యం ఆ మెరుపు వెలుగులో ఒక క్షణకాలం మాకండ్ల బడింది. వెన్నెలా మెరుపూ కలసిన వెలుగులో ఆ వ్యక్తి ఏదో ఇహలోకానికి సంబంధంలేని మృతజీవిలాగు అనిపించింది మాకు.

ఫెళఫెళమన్న ఉరుములుఆగిన తరువాత తిరిగి చీకటి క్రమ్మింది ప్రపంచం. ఫటఫటమన్న చినుకులతో వర్షం హెచ్చింది.

శారదాంబగారి ముఖం, దీపపు వెలుగులో బాధగా కనిపించింది.

మా అవ్యక్త ప్రశ్నకూ, ఆశ్చర్యానికీ జవాబుగా "అది గంగారత్నం. ఇరవైఅయిదు ఏండ్లయిందమ్మా అది ఫక్కున నవ్విగాని, భోరున ఏడ్పుగాని. ముక్తసరిగా జవాబులిస్తుంది; అదైనా ఇష్టమైతే. తన ప్రపంచం తనది. వర్షమైనా వరదైనా ఇల్లా, పున్నమి చంద్రుడికి ఏమి ప్రార్థనో చేసి దణ్ణం పెడుతుంది" అన్నారు శారదాంబగారు. జనార్దనయ్య గారు చుట్ట గుప్‌గుప్‌మని మరీ ఎక్కువగా పీల్చారు.

బయట వర్షం బాగా హెచ్చింది. శారదాంబగారు మాతో చెప్ప నారంభించారు.

• • •

సోమరాజుగారు చాలా మోతుబర్లు ఈ ఊళ్లో. అజానుబాహు. స్ఫురద్రూపి. కఠినంగా మాట్లాడడం తెలియనైనా తెలియదాయనకు. దయాదాక్షిణ్యాలు, దానధర్మాలు ఎక్కువ. మా జనార్దన తాతయ్యగారూ, ఆయనా చిన్నప్పటినించీ ఒక వీధి బడిలోనే చదువుకున్నారుట. ప్రాణస్నేహితులు ఇద్దరూనూ.

తొలి భార్యకు నలుగురు కొడుకులు — అతి దుర్మార్గులమ్మా; తులసమ్మ కడుపున దూలగుండ పుట్టినట్టు పుట్టుకొచ్చారు.

రెండవ కళత్రం చూలాలు. అప్పుడు కట్టారు ఆ కనబడుతున్న ఇల్లు — కలువగుంట కవతలిది. అసలు, సోమరాజుగారిది ఈ వీధి మొదట ఉన్న పెద్ద లోగిలి. ఈ స్థలం ఆయనది. అందుకని వంట కట్టెలు వగైరా పెట్టుకోడానికనే అభిప్రాయంతో ఈ చిన్న ఇల్లు కట్టారు. దానికి పునాదులు తీసేటప్పుడు బయటపడ్డది ఆ విగ్రహం. బాగా నిలువుఎత్తుది— రాతి విగ్రహం. అది ఏనాడో గ్రామదేవత గంగమ్మ అని అందరూ నిశ్చయించారు. ఆ దేవికి గుడి కట్టి ప్రతిష్ఠ చేస్తానని సోమరాజుగారు అందరితోనూ మనస్ఫూర్తిగా అన్నారు. తాత్కాలికంగా అదిగో మనకు ఫర్లాంగు దూరంలో ఉన్న 'నడిదిబ్బ' మీద చింతచెట్టు ప్రక్కన కొంచెం దూరంలో, కాస్త పల్లం ఉంటే, అక్కడ నిలబెట్టి, చుట్టూ రాళ్ళూ, మన్నూ అండవేర్చారు.

ఇల్లు కట్టడం పూర్తికాగానే చుట్టూ గుడి కట్టిస్తానన్నారు. కాని ఇల్లు పూర్తి అయింది. ఆయన భార్య ఆడపిల్లను ప్రసవించి అరటిచెట్టల్లే కూలిపోయింది. పిల్లకి గంగమ్మతల్లి పేరే పెట్టారు. కాని భార్యపోయిన దగ్గరనుంచీ, మనిషి అదోలాగయిపోయాడు—క్రుంగిపోయాడు. బ్రతుకుమీదే ఆసక్తి తగ్గిపోయినట్లయింది. తను ఆ ఒక్క పసికూనకోసమే బ్రతికి ఉన్నాడా అనిపించేదమ్మా. దేవి విగ్రహానికీ, గుడి కట్టడానికీ ఉత్సాహం లేదు. ఆపని, నాటికి నాటికీ యావన అవుతూనే వచ్చింది. అందరూ ప్రోత్సాహించినా, ఆయన అదిగో ఇదిగో కట్టిద్దామనేవారేగాని, శ్రద్ధగా కట్టడానికి పూనుకోలేదు. ఆయన మనస్సు నెమ్మదీ లేదు. గంగమ్మ తల్లి ఎండల్లో వెలిసి వానల్లో తడుస్తూనే ఉండేది.

ఇహను, సోమరాజుగారు ఈ పసిదానికి తల్లీ తండ్రీ తానై, వెయ్యి కళ్ళతో కాపాడుతూ వచ్చారు. తండ్రి అంత ఆజానుబాహువాయె. ఆయన అంత పెద్ద చేతులూ ఎంతో నాగరికంగానూ, సుకుమారంగానూ, సున్నితంగానూ వంగేవి ఆ బిడ్డని సంరక్షించేటప్పుడు.

ఈ గంగ అన్నారూ, ఇది ఒక విచిత్రమైన పిల్ల. 'చందమామ రావే, జాబిల్లి రావే' అని ఎదిగిన తర్వాత కూడా, చిన్నప్పుడు వాళ్ళ నాన్న నేర్పిన పదం పాడుతూ, ఎప్పుడూ చంద్రునికేసి చూస్తూనే ఉండేది. దానికి పువ్వులన్నా మహా ఇష్టం. నన్నడిగి, మనదొడ్లో మల్లెలన్నీ కోసుకుపోయినా దానికి ఆశ తీరేది కాదు. అయినా, ఆఖరుకు ఒక పువ్వుమాత్రం చెట్టుకి ఉంచేది, చాదస్తంగా "పెన్నిగారూ ఈపువ్వు చందమామకి" అంటూ. తండ్రి చెయ్యి పట్టుకునే తిరిగేది ఎప్పుడూ. దాన్ని వదిలి తండ్రీ ఒక్క ఘడియ ఉండరు.

సరి, తండ్రీ కూతుళ్ళమధ్య ఈ అనురాగం, అన్నలకు ఈర్ష్య ఎక్కువ చేసింది. తండ్రి కాస్త దూరంగా ఉన్నప్పుడూ, ఎవ్వరూ దగ్గరలేనప్పుడూ గంగని ఇంట్లో చిత్రహింస పెడుతూండేవారు.

"ఒరే, తల్లిలేనిదాన్ని ఎందుకురా అల్లా అన్నారుట?" అని, ఒకవేళ ఆయన అడిగితే "మీరు మరీనూ. మా కుందా ఏం తల్లి?" అనేవాటు కొడుకులు.

కళ్యాణసుందరి జగన్నాథ్

ఇలా రోజులు గడుస్తున్నాయి. ఒక చీకటి రాత్రి, భోజనాల వేళకు ఒక పెద్ద పొలికేక వినిపించింది — ఉన్నట్టుండి హఠాత్తుగా. అసలే దయార్ద్రహృదయుడేమో, సోమరాజుగారు, కొడుకులతో "ఒరే ఎవ్వరో పరదేశి దారి తప్పినట్లున్నాడు. మన నడిదిబ్బ ప్రక్కనించే వినిపిస్తూంది కేక. వెంటనే వెళ్ళండ్రా" అన్నారు. "భోజనాలకి కూచుంటున్నాం. ఆఖరుకి కన్నకొడుకులకంటే పరదేశి ఎక్కువయ్యాడు మీకు" అని గొణుక్కున్నారు. ఆఖరుకి పాలేళ్ళు వెళ్ళారు, హరికేను లాంతర్లూ, బాణాకర్రలూ పుచ్చుకుని. ఆ నడిదిబ్బ మీదినించీ పెద్ద గట్టు ఒకటే, కాలువ ఒడ్డు రహదారీ రోడ్డుకు కూడా చేరుతుంది. అందువల్ల నడిదిబ్బను అప్పుడప్పుడు అడ్డత్రోవగా కూడా ఉపయోగిస్తారు. అన్నట్టూ, మీరు బస్తీ పిల్లలుగా. ఇలా చీకట్లో దారి తప్పినా, దొంగలచేత చిక్కినా మా పల్లె సీమల్లో అల్లాగే అరుస్తారు. దగ్గర ఉన్న గ్రామాల వాళ్ళు ఎదురు అరుచుకుంటూ వెళ్ళి బాటసారిని రక్షిస్తారు. అది ఆనవాయితీ. ఇప్పుడంటే కొన్ని గ్రామాల్లోనైనా వీధి లాంతర్లు వద్దాయిగాని.

ఆతను ఒక బీద యువకుడు. కాస్త దూరపు పల్లెటూరు. ఒక విధవ తల్లి తప్ప, నా అనేవారు లేరు. పొలాలు పండక, అప్పులు తీర్చలేక గడవడం కష్టమై, ఇటుప్రక్క బస్తీలో పంచదార ఫ్యాక్టరీ పెట్టారంటే, అందులో గుమాస్తాగిరి వెతుక్కోడానికి వెళుతూ, ఎరుగని ఈ ప్రాంతంలో దారి తప్పాడట. చీకటి పడ్డదట. గ్రామం దీపాలు కనిపించి, అడ్డత్రోవని నడిదిబ్బ మీదుగా వస్తూ, చీకటిలో కనబడక, గంగమ్మతల్లికి చుట్టూ నిలబెట్టడానికి పెట్టిన చిన్నరాళ్ళ కాళ్ళకి తగిలి, దేవిమీదే పడపోయాడట. కాళ్లకు గాయాలు తగిలినాయి. కాస్త తెప్పరిల్లి కేకపెట్టాడట.

విషయమంతా విని, సోమరాజుగారు భోజనం పెట్టించి, వసతి ఇచ్చి, మరునాడు తనవద్దనే గుమాస్తాగా ఉందువు లెమ్మన్నారట.

కొన్నాళ్లకు ఆ బాటసారి నాగభూషణం, సోమరాజుగారికి నమ్మినబంటయ్యాడు. యజమానీ క్రమేణ అతనిమీదనే నిర్వహణ అంతా వదలివేశారు. ఈ విషయం తన కొడుకులకు అగ్నిలో ఆజ్యం పోసినట్టయింది.

# మొటిమలు మాయమగును

చర్మము మృదువుగా శుభ్రపడును

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడుట గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.


# పున్నమి మసకలు

కొన్నాళ్లకు కొడుకులకు వరసగా పెండ్లిండ్లయినాయి. పెద్ద కోడలు మహా గయ్యాళి. భర్తకు తగినదే. పుట్టింటివారు కలిగినవాళ్ల గారు. ఇక్కడ భర్తకు నేర్పిపెట్టింది. ఆ ప్రోద్బలంమీద, ఒకనాడు "మా ఆస్తులు మాకు పంచి ఇవ్వండి" అన్నాడు పెద్దవాడు, తండ్రిని, ఎదురుంగానే. తండ్రికి ఊరంతా జోహారు లిస్తారాయె! అందుకని ఈ మాట గొంతెరె కరవవచ్చినట్లనిపించిం దాయనకు. "ఇప్పుడేం తొందర్రా, చంటిదానికి కూడా నాలుగు అక్షతలు పడనియ్యి" అన్నారు ముక్తసరిగా. రుసరసలాడుతూ పెద్దవాడు తన గదిలోకి వెళ్లిపోయాడు. ఆ రోజున జనార్దన తాతగారు అక్కడే ఉన్నారట. భార్య అందించగా, మళ్లా వచ్చి "అయితే ఈ ఆస్తిలో ఒక దమ్మిడీ గంగ కివ్వడానికి వీల్లేదు. ఇది పిత్రార్జితం. అది తీసికెళ్లి ఏ పరాయివాడి కొంపో నిలబెట్టడానికి మేమెవ్వరమూ ఒప్పుకోము" అన్నాడు కచ్చితంగా. దానికి, తండ్రి "నా స్వార్జితం వేరే పది ఎకరాలు బంగారు చెక్క ఉందిరా. దాని తల్లి జవ్వారీ దానికి బోల తొడుగు. మీ దయా దాక్షిణ్యాలు దానికేమీ అక్కర్లేదురా" అన్నారు. పళ్లు లోలోపలే కొరుక్కుంటూ, తన గదిలోకి వెళ్లిపోయాడు పెద్ద కొడుకు.

ఇహను పెద్ద కోడలు ఆలోచించడం మొదలెట్టింది. తనకి ఒక్కడే ఒక్క తమ్ముడు హనుమంతు. చదువు సంధ్యలూ లేవు, రూపురేఖలూ లేవు సరిగదా, కలిమి అసలే లేదు. పైగా వేపకాయంత వెర్రి అని కూడా చుట్టూ గ్రామాల్లో ప్రఖ్యాతి వచ్చింది. వలుగు రాడవాళ్లు ఎక్కడైనా గుమికూడితే సర్వమూ మరచిపోయి, అక్కడే ఇకిలిస్తూ నిలుచుంటాడు. వరసైనవాళ్లు, ఆడపిల్లలను అంత దూరాన చూపించి, "ఆ అమ్మాయి సంబంధం మాట్లాడుతాం రా నీకు" అంటే చాలు, వాళ్ల కోసం ఎంత కాయకష్టమైనా చేస్తాడు. ఆ హనుమంతుకి ఎలాగా, ఎవ్వరూ పిల్లనివ్వరు. ఈ తల్లిలేని గంగని మతి విరిచేసి, వాడికిచ్చి పెళ్లి చేస్తే, సొత్తూ, సంబంధమూ అన్నీ వస్తాయి. తన పుట్టిల్లూ నిలబడుతుంది. గంగకిచ్చే ఆస్తి తన తమ్ముడికే వస్తుంది.

హనుమంతుని ఇంటికి రప్పించింది. అతన్ని గురించి, గంగ దగ్గర పొగడడం మొదలెట్టింది. ఇంతవరకూ తండ్రి ప్రక్కన కంచం పెట్టమంటే "ఏం మగరాయుడవా? ఆడవాళ్లతో భోంచెయ్యి" అని కసిరే వదిన, తండ్రిగారు, గంగ ప్రక్కన హనుమంతుకీ సహపంక్తిని వడ్డించడం ఆరంభించింది. సోమరాజుగారిది రాజ చూపు. ఈ పన్నాగాలు ఏవీ సోకలేదాయనకు.

గంగ ఎదిగి, బంగారుబొమ్మలా అయింది. నిజంగా శివుడి శిఖలో ఉండవలసిందే ననిపించేది. వంటినిండా బంగారు తొడుగు — తన తల్లిది. వన్నె కొక చీర నేయించాడు తండ్రి.

అమ్మవారికి తను మొదటనుంచీ అనుకున్నట్టే గుడి కట్టించి, వెంటనే గంగకు పెండ్లి ఏర్పాట్లు చేద్దామని నిశ్చయించారు సోమరాజుగారు — మీ జనార్దన తాతగారితో సంప్రదించే.

గంగ మనస్సులో ఏమేమి భావా లుండేవో ఎవ్వరికీ తెలియదు. భూషణం బుద్ధిశాలీ, గుణవంతుడూ అనే తెలుసు. వయస్సులో ఉన్న అతని మనస్సూ మనం ఎరుగము. కాని ఒక్కసారి ఒక ఘట్టం జరిగింది.

ఈ ఎదురంగా ఉన్న — కలువగుంట కవతలి ఇంట్లో, వంటచెరుకూ, వ్యవసాయపు సామానులూ పెట్టి ఉంచేవారు — ఆ ఇల్లు కట్టినప్పటినించీ, అంటే, గంగ పుట్టుకనించీ. ఒక ప్రదోషవేళ తండ్రీ కూతురూ ఈ ఇంటికి


పండ్లను మెరయునట్లు చేయుటకు,
నోటిని శుభ్రపరచుటకు,
వైటోడెంటునే వాడండి.




శ్రీవత్స కెమికల్స్ అండ్ డ్రగ్స్
ప్రైవేటు లిమిటెడ్, మదరాసు-30.

NAVIN.

# చలం సాహిత్యం

నూతన రచనలు - ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| జీసస్ జీవితం | రు. 5—00 | మార్తా (నవల) | రు 5—00 |
| కొత్త చిగుళ్లు (కథలు) | రు. 2—00 | భగవాన్ స్మృతులు | రు. 9—00 |
| నిర్వికల్పం (వ్యాసాలు) | రు 3—00 | వెలుగురవ్వలు (కథలు) | రు 2—00 |
| ఆరాత్రి (కథలు) | రు. 4—00 | చలం గీతాలు | రు. 2—00 |

ముందుగా రు. 25 లు మనియార్డరు చేసినవారికి ఈ పుస్తకాలన్నీ రిజిష్టరు పోస్టులో పంపిస్తాం; లేక ఏ పుస్తకాలు కావలిస్తే, వాటి విలువ సొమ్ము ముందే మనియార్డరు చేసినా, అవి కూడ రిజిష్టరు పోస్టులో పంపిస్తాము. పుస్తకాలన్నీ వాటి వెల, పైగా అయ్యే పోస్టేజీ కూడ చెల్లిస్తే, వి. పి. పి. లో కావాలన్నా పంపించబడతాయి.

**SRI RAMANASTAN PUBLICATIONS**

POST BAG No. 9, TIRUVANNAMALAI, MADRAS STATE.

ఎ. పి. బి. డి. (సికింద్రాబాద్), విశాలాంధ్ర ప్రచురణాలయం (విజయవాడ), అన్ని రైల్వే హిగ్గిన్‌బాథమ్సు బుక్‌స్టాల్సులోనూ ఈ పుస్తకాలన్నీ లభిస్తాయి.

వచ్చారు. కావలసిన సామానులు తీసి, నౌకర్ల చేతికిచ్చి పంపి, వెనక ఇల్లు సరిదిద్ది తాళాలు వేసుకుంటున్నారు సోమరాజుగారు. ఈలోపుగా గంగ బయటికి వచ్చింది. అంటే ఈ కలువ గుంట గట్టుమీదికే నన్నమాట. ఆ గట్టు ప్రక్కన కలువలు దట్టంగానే ఉండేవి. ఇటు ప్రక్క నీళ్ళు తెరపిగా ఉండేవి. పైగా అప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. గాలి లేదు. చుట్టూ ఎవ్వరూ లేరు. గంగ, ఎదురుంగా ఉదయిస్తున్న చంద్రుణ్ణి చూస్తూ నిలబడిపోయింది గట్టుమీద — తనను తానే మరచిపోయి. ఎలా ఉందనుకున్నారప్పుడది? చూడ్డానికి రెండు కళ్ళు ఛాలవు. అల్లా తన్మయత్వంలో మైమరచి, మునిగిపోయిన ఆ అపూర్వ ప్రతిమను మీ తాతగారూ నేనూ ఇక్కణ్ణించి అల్లాగే చూస్తూ ఉండిపోయాం. కాని, మా కళ్ళు కాస్త ఇటు మళ్ళేటప్పటికి ఈ మామిడిచెట్టు మరుగునుంచీ, ఈ తెరపి నీళ్ళల్లోకి చూస్తూ, భూషణం కదలకుండా నిలబడి ఉన్నాడు. ఆ తెరపి నీళ్ళల్లో ప్రతిబింబిస్తున్న చంద్రుణ్ణీ, పైకి తలెత్తి చూస్తున్న గంగ నల్లటి ప్రతిబింబాన్ని, రహస్యంగా తదేకదృష్టితో చూస్తూ నిలబడిపోయాడు. అతను ఎటునించీ వచ్చిందీ మాకూ తెలియదు. అంతలోకే సోమరాజుగారు కేక పెట్టారు. గంగ తిరిగి ఎవ్వరినీ చూడకుండానే తండ్రితో కలిసి పెద్ద ఇంటికి వెళ్ళిపోయింది. భూషణం మమ్మల్ని చూడనే లేదు.

హనుమంతు వెర్రిచేష్టలు ఎక్కువయ్యే సరికి, ఉండబట్టలేక ఇంట్లో కర్రపెత్తనం చేస్తున్న సోమరాజుగారి పెద్దక్కగారు విషయమంతా ఆయనతో చెప్పివేసింది — హనుమంతునీ, వాళ్ళక్కని గురించిన్నీ. సోమరాజుగారు ఉగ్రరూపం దాల్చారు. ఆనాడు అందరూ భోజనాలవంగానే, అందరూ వినేటట్టూ అన్నారు "ఇదిగో ఎవ్వరూ పిచ్చిఊహ లేమీ పెట్టుకోనక్కరలేదు. వెర్రి వెంగళప్పల కందరికీ ఇచ్చి ముడెట్టడానికి నా కూతురేం నాకు బరువా? లేక కాలు వంకా? చెయ్యి వంకా? ఇల్లాంటి సంబంధా లందకముందు దాన్ని నూతిలో త్రోసి, చంపి, నేను చస్తాను. అల్లాంటి పెళ్ళి బ్రహ్మకల. అల్లాంటి ఆలోచనలన్నీ మానడం మంచిది" అని గర్జించారు. పెద్ద కోడలు కారాలూ మిరియాలూ నూరింది. తన ఆశలన్నీ, ఏర్పాట్లన్నీ నిష్ఫలమైనాయి.

ఆవిడ, విషతుల్యంగా రెండో పన్నాగం పన్నింది. గంగమీద అసూయ ఎక్కువైంది. దానిమీద లేనిపోని నిందలువేసి మాట్లాడడం మొదలెట్టింది. అమ్మాయికి సర్పదోషం ఉందని అమ్మలక్కలందరితో రహస్యంగా చాటించింది. "అందుకనే సొత్తులో సొత్తుగా ఉంటుందని, మావాడికే కట్టేద్దామా అని కూడా అనుకున్నా. ఏం లాభం? ఆ చక్కని చుక్కకి మావాడు పనికిరాలేదుట. ఏ తలచెడ్డ

# శుద్ధ మధ్యాక్కరాలు

**ఆరుద్ర**

**బంగారు** నగల కంట్రోలు
ప్రజల మెడలో పెద్దడోలు
అంగలార్చె స్వర్ణకార్లు
అర్పించినారు మహజర్లు
పుంగవుడు కద శ్రీ మొరార్జి
బుట్టదాఖలుచేసె అర్జీ
సంగోరు ఆ ఉసురు తగిలె
స్వాధికారపు ఘటము పగిలె.

* * *

విలువ కట్టగ లేనిదేది?
తుల తూచగా రానిదేది?
చెలిమి చేసిన సఖుడిచేయి
చెలువమ్ములోనున్న హాయి
తులువ ఏమిటి కోరుకొనును?
తుచ్ఛసుఖమే గొప్పదనును
చెలిమి శిలపై వ్రాయువ్రాత
కలిమి జలములు చేయు
మోత.

* * *

మొగుడి శిరసును చితకకొట్టి
మొగసాలకెక్కి మొరపెట్టి
తగువులో గెల్చు గయ్యాళి
ధాటి కోర్వదు మహంకాళి
జగదంబ కాళికే నయము
మగడి మేనులో ఆమె
నగము
పొగరు మోతుకు భర్త అలుసు
పొలతికంటికి అతడు
నలుసు.

* * *

తొలి సంఘ జీవితములోన
పలు వృత్తులుండేవి కాన
తెలుగు భాషలో వేరువేరు
తేటపేర్లను పెట్టినారు
కులములైనవి వృత్తులయ్యో
తెలివి తక్కువ పెరిగెనయ్యో
తెలుగు మాటకు సిగ్గుపడకు
తెలియని పదం తెచ్చుకొనకు.

దొంగసారా అమ్మువాడు
దొంతర్లమేడ కడతాడు
పొంగిపారును సీమకల్లు
పురవీధిలో వైనుజల్లు
అంగళ్ళుగా మారె ఇళ్ళు
అలముకొనె ప్రొహిబిషన్
కుళ్ళు
భంగపాటును ఒప్పుకోని
ప్రభుతనీతులు తుదకుహాని.

* * *

కౌరవులవద్ద కానాడు
కన్నయ్య సంధికెళ్ళేడు
చౌరపద్ధతి సేనలెక్క
సంగ్రహించేడు ఎంచక్క
పౌరులను పాలకులనుండి
పట్టిఊడ్చగ కొట్టెగండి
ఔరౌర! ప్రతి రాయబారి
గౌరవముగల గూఢచారి.

* * *

కాసు చేయని నీటుకాడు
కాలరెత్తుకు తిరుగుతాడు
వాసికెక్కిన మంచివాడు
వందనాలకు వంగుతాడు
ఈసుచే బాధపడుబోళ్ళా
ఏదిచేసిననూ దివాలా
బాసతప్పని గొప్పవాడు
ప్రజలమదిలో బ్రతుకు
తాడు.

* * *

సన్నగా వున్నట్టివారు
దున్నవలె బలవబోతారు
దున్నవలె వున్నట్టివారు
తొందరగ చిక్కబోతారు
ఉన్నదాంతో తృప్తిపడరు
ఓడినా పంతాన్ని విడరు
తిన్నగా ఆరోగ్యమున్న
దేహధారికి లావుసున్న. *

# పున్నమి మసకలు

వాడూ కట్టుకోడు గదా! ఎవ్వరి ప్రాణం వాళ్ళకి తీపి కదుటమ్మా?" అంటూ, పనిమాలి వచ్చిన అమ్మలక్క లందరితోనూ — విసుగు లేకుండా చెబుతూ వచ్చింది. ఊరంతా ఆ మాట పాక్కిపోయింది. సోమరాజుగారికి ఇంకా ఈ విషయం తెలియలేదు.

ఈలోపుగా గంగ తెలివితక్కువ పని ఒకటి చేసి మాకు దొరికిపోయింది. గంగ చిన్నతనంలో చేసిన విచిత్రమైన పనులలో ఒకటేమిటంటే, లేగదూడల మూతులకి వేసిన చిక్కాలు కాస్తా విప్పివేయడం, ఆ చిక్కాలు గంగ చూడలేక పోయేదట. నోరు కట్టేస్తే ఎల్లా? అయ్యో పాపం! అనిపించేదట. అందుకని విప్పేసేది. ఆ దూడలు మరీ ఎక్కువ పాలు త్రాగేయడమూ, మన్ను తినడమూ జరిగేది. ఆ పసివాటికి కడుపునొప్పి వస్తూండేది. అయినా విప్పేయడం మానలేదు. దీని ఏడుపుముఖం చూచి, వాళ్ళ నాన్నగారు కూడా ఏడ్చినంతపని చేసేవారట. ఆ కారణంగా జున్నుపాలు ముట్టేదిగాదు. జున్ను కన్నెత్తి అయినా చూడదు. ఆ పసిదూడల నోళ్లదగ్గర నుంచి ఆ పాలు మనం తియ్యడం పాపం అని దానికి ఒక నిశ్చితాభిప్రాయం ఆ చిన్నతనంలో. అల్లా, అల్లా క్రమంగా జున్నంటే అసహ్యం ఏర్పడ్డది గంగకు. సోమరాజుగారుమాత్రం అందరితోపాటే. ఇష్టమూ లేదు, అయిష్టమూ లేదు.

అలాంటప్పుడు మన ఎర్రగేదె ఈనితే "పిన్నిగారూ జున్ను వండరూ? వండిపెట్టరూ? వండండీ!" అని గంగ ప్రాణం తోడేసింది. నేను వండి రెండు ఆకుల్లోనూ పెట్టి కబురుపెట్టా, తండ్రీ కూతుళ్లను రమ్మని. సోమరాజుగారూ భూషణమూ వచ్చారు. "గంగ ఏదీ?" అన్నాను. "దానికి జున్నుపడ గిట్టదుగా. భూషణానికి జున్ను చాలా ఇష్టమని అన్నాడుట. అందువల్ల అతన్ని కూడా తీసికెళ్ళమంది నన్ను" అన్నారు సోమరాజుగారు. పాపం, భూషణంకూడా అర మరేమీ లేకుండానే అడిగి మరీ వేయించుకుని తృప్తిగా తిన్నాడమ్మా. ఇంతకీ, దానితో మాకు కాస్తా తెలిసిపోయింది వ్యవహారం.

ఇలా ఉంటూంటే, ఓనాడు హనుమంతు ఒక అట్టమీద ఒక కప్పపిల్లని తెచ్చి గంగమీదికి విసిరివేశాడుట. అది అసలే భయస్తురాలేమో, కెవ్వుమని కేక పెట్టిందట. ఇది సోమరాజుగారి వెధవక్కగారు చూచి "ఏమిటబ్బాయి, ఆ మోటు సరసం? పిల్ల జడవదూ?" అని గర్జించింది. అంతలోకే హనుమంతు అక్కగారు "ఆఁ! ఈమాత్రానికే అంత అదిరిపాటెందుకమ్మా? వాడు వెయ్యాలని ఏమీ వెయ్యలేదు ఇంతోటి సుందరిమీదాను, ఆ కప్పని. ఎంత అబ్బురం అమ్మా ఈ పిల్లది! ఎవ్వరో కొట్టినట్టా అరుస్తుందే? ఇంట్లోకి కప్ప వచ్చిందే అని, వాడు దాన్ని అట్టమీదికి ఎక్కించి పారవెయ్యడానికి వెడుతున్నాడు. వెడుతూంటే ఆ కప్ప కాస్తా చటుక్కున గెంతింది. ప్రక్కనున్న ఆ అమ్మాయిమీద పడ్డదల్లే ఉంది. దానికి ఏదో కావాలన్నట్టూ ..." అని ఏకరవుపెట్టింది. చేసేదేమీ లేక గంగ ఏడుపుముఖం పెట్టింది.

ఇహను అక్కడినించీ ఒక్క సంబంధం వస్తే ఒట్టు. అమ్మాయికి దోషముందనీ, ఏమేమో వదంతులు. ఊరు ఉడికిపోయింది. ఒక్క సంబంధమూ రావడంలేదు. దానితో సోమరాజుగారికి మనోబాధ ఎక్కువవుతూ వచ్చింది.

ఇప్పటికి బహిరంగంగానే ఆయన్ని ధిక్కరిస్తున్నారు, కొడుకులూ కోడళ్ళూ. జీవితమంతా మర్యాదకి అలవాటుపడ్డవాడేమో, ఆయనకు మనస్సు మహా బాధపడుతూండేది. గంగకి ఇంట్లో రంపపుకోత పెట్టేవారు అన్నలూ, వదినలూ కూడా. ఆయన ఒక్క నిమిషం పొలంలోకిగాని వెళ్ళితే చాలు, దానిని ఏదో ఒకటి అనడమో గేలి చెయ్యడమో ఏదో జరిగేది. సోమరాజుగారికి కుమార్తె వివాహం ఒక సమస్య అయిపోయింది. ఆయన మనస్సు క్రుంగిపోయింది. అది ఆఖరుకు ఒక తీరని బెంగ అయిపోయింది. రాత్రీ, పగలూ ఆ పిల్లగే ధ్యాస అయిపోయింది. మరేదీ ఆలోచించడం మానేశారు. ఒక్కొక్కసారి గంగ తల నిమురుతూ కళ్లల్లోనించీ కన్నీళ్లు జార్చేసేవారు. అది చూచి తండ్రిని కౌగలించుకుని అదీ ఏడ్చేసేది.

ఆఖరుకు మీ జనార్దన తాతగారి సలహామీదనే, పిల్ల పేర 'ఉయిలునామా' వ్రాశారు రహస్యంగా. పిల్లకు మైనారిటీ తీరిన తరువాత ఆ పది ఎకరాల పొలమూ ఆరు వేల రూపాయల జవ్వారీ ఈ చిన్న ఇల్లూ దానికి చేరేటట్టూ. సంతకం మీ తాతగారే పెట్టారు. అది రెండో కంటివాడికి తెలియకుండా భద్రంగా ఇనప పెట్టెలో పెట్టి దాచారు, సోమరాజుగారు.



'దారి విడువు కృష్ణా'

చిత్రం—టి. ఆనంద్ (కాకినాడ)

మన సలహామీదనే గంగని భూషణానికిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించారు. భూషణం తల్లి దూరపు దాయాదితో తరలివచ్చింది. వివాహానికి పెట్టిన బంగారు తొడుగు ఎల్లా తీసి భద్రంగా దాచేశారు సోమరాజుగారు. పిల్ల వంటిమీదనించీ కూడా బలాత్కారంగా లాగేసుకుంటారేమో ననిపించింది ఆయనకీ, మాకూ కూడాను.

గంగనూ, అల్లుణ్ణీ ఆ ఇంట్లో ఉండడానికి వీల్లేదన్నారు కొడుకులు. "నిన్నటివరకూ మాకు జీతగాడివా! ఈ వేళ యీ ఇంటికి అల్లుడివా!" అంటూ అమర్యాదగా, హీనంగా చూడడం మొదలుపెట్టారు. అక్కడ ఉండడం దుర్భరం అయిపోయింది.

అప్పుడూ, ఈ ఎదురుంగా ఇంట్లోనే సామాను ఖాళీ చేయించి, ఇక్కడ కాపరం పెట్టించారాయన. గంగకు అత్తగారు పెద్దదిక్కు. పాదర సామానులన్నీ తన ఇంట్లోనుంచే పంపిస్తూ వచ్చారు. అదీ అన్నలకు ఇష్టంలేకపోయింది. సామాను వస్తూంటే అటకాయించడం మొదలుపెట్టారు. అసలు ఈ ఇంటో నుంచీ కూడా వెళ్లగొడుదురు, మాకంతా జడిసి, అంటే పాపానికి వెరిచికాదు, లోకానికి. క్రమంగా, ఆ యేడు పొలంలోనూ, ఇంట్లోనూ కూడా అధికారం తీసేసుకున్నారు, ఆయన దగ్గరనించీ. ప్రతీ విషయమూ ఎదిరించడం ఎక్కువ చేశారు. ఆయనకు దుఃఖం పొంగుకు వచ్చేది. ఎన్నిసార్లో కళ్లల్లో నీళ్ళు వచ్చేవి. "వంటేదానికి కాస్తా అక్షతలు పడ్డాయి అన్నగారూ, ఇకను నేను ఏదో మయ్యో, గొయ్యో చూచుకోడం ఉత్తమమనుకుంటాను! దాని మైనారిటీ తీరి దాని సొత్తు దానికి హక్కు అయ్యేవరకూ నేనిలా జీవచ్ఛవంలా బ్రతకాల్సిందే?" అని ఇక్కడ మా ఇంట్లో అంగలార్చేవారు.

కొడుకులు భూషణాన్ని గుమాస్తాగిరిలోనించీ తీసివేశారు. ఇంటికి రావద్దన్నారు. ధాన్యం వాళ్లే గరిసెలు కట్టించారు. సర్వాధికారాలూ చేతపట్టుకున్నారు. క్రితం సంవత్సరం బాపతు ధాన్యం పన్నెండు పుట్లు నిలవచేసిన గాదె తాళాలూ, ఇనపపెట్టె తాళాలూ గుత్తగా సోమరాజుగారి వద్దే ఉండేవి. అవిమాత్రం అప్పటికి ఆయనవద్ద నుంచీ పుడిగి పుచ్చుకోలేకపోయారు. ఎందుకైనా మంచిదని ఆ తాళాలగుత్తి మీ తాతగారివద్దే ఒప్పచెప్పేశారు రహస్యంగా, ఆయన. భూషణం, తను సంవత్సరాల క్రితం అనుకున్నట్టూ చక్కెర ఫ్యాక్టరీకి వెళ్ళి చేతికందిన పని చేసి, వస్తున్నాడు. రెండు రోజులు పని ఉంటే, రెండు రోజులు పని ఉండేదిగాదు.

**(తరువాయి 56 వ పేజీలో)**

గంగకు కుటుంబం గడవడం కష్టమనిపించింది. కరువులో అధికమాసం అన్నట్టూ, అత్తగారు "కలిగినవాళ్ళ సంబంధం అందాం. ఏం లాభం? నా కొడుకు పొట్ట చేతబట్టుకుని కాలి నడకని అంతదూరం వెళ్ళి పనిచేసుకోవలసివచ్చింది! దిక్కుమాలిన సంబంధం" అంటూ విసుక్కునేది. ఒక్క భూషణం మాత్రం దేవుళ్ళాగూ చూచేవాడు.

ఇలా ఒకసారి తహశీలు కట్టడానికి బస్తీ వెళ్ళేటప్పుడు ఇంత కారం బుట్టలో పోయించుకుని చేతపట్టుకుని బయలుదేరారు — వెళ్ళేటప్పుడు గంగకి ఇచ్చి వెళదామని సోమరాజుగారు. అంతే. పెద్ద కొడుకు అమాంతంగా వచ్చి చేతిలో నుంచీ ఆ బుట్టని బలాత్కారంగా లాగాడు. అతని చేతుల్లోనుంచీ అంత దగ్గిరసా వచ్చి, వస్తువులు తీసుకోడం అదే మొదటిసారి. ఆయనకి కళ్ళు తిరిగి పోయినాయట. ఆ బుట్టలో కారం చెల్లాచెదురై, వాకిలంతా అందరి కళ్ళల్లోనూ పడ్డది. పెద్ద రచ్చ జరిగింది. ఆయన వట్టి చేతులతో కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరాడు. అపుడాయన ముఖం వెళుతూంటే గుమ్మంలోనించీ చూచానమ్మా. చెంపలవెంట కన్నీళ్ళు కారుతున్నాయి. ఏమేమి ఆలోచనలు తల్లో తిరుగుతూన్నాయోనమ్మా! మేము పలుకరిస్తే కూడా బదులైనా చెప్పలే. అసలు వినిపించుకోలేదు. అల్లాగే ఎదురుంగా చూచుకుంటూ నడిచి వెళ్ళిపోయారు బస్తీ. వెంట పెద్ద పాలేరు నడుస్తూ పోయాడు దిగులుగా.

ఆరాత్రి, ఇంట్లో అమ్మాయికి కాపలా ఉండమని ముందరే పాలేరుని పంపించేశారు. తను పని చూసుకుని నడిచి వస్తూంటే, వెనక ఎవ్వరో నడిచినట్టనిపించిందట. వెనక్కి తిరిగి చూస్తే ఎవ్వరూ ఉండేవారు కారట. కాస్సేపటికి ఊబిలో నడిచినట్టూ, కాళ్ళు బరువుగా అనిపించినాయట. ఒక్కొక్కకాలే ఎత్తి అడుగు వెయ్యవలసి వచ్చేదట. తిన్నగా వచ్చి గంగతోనూ, భూషణంతోనూ చెప్పి, గంగని చూచి ఏవేవో అర్థం లేకుండా గొణిగి ఇంటికి వెళ్ళి పండుకున్నారు. అంతే.

మరునాడు లేచి, కాస్త తబ్బిబ్బు మాటలాడారట. మతిస్థిరం తప్పిపోయింది. వాళ్ళ అక్కగారు నిమ్మకాయలతో స్నానం చేయించారు. పిచ్చి తగ్గలేదు. అపుడపుడూ కాస్త బాగా మాట్లాడేవారు. వెంటనే మతిపోయేది. అప్పుడప్పుడు వచ్చి కూతురిని ఆలనా పాలనా అడిగేవారు. కావలసిన వస్తువులు తనంతట తానే ఎల్లాగో, రహస్యంగా తెచ్చి ఇస్తూండేవారు. చుట్టుపట్ల పల్లెటూళ్ళన్నీ కాలి నడకని తిరిగి వస్తూండేవారు. ఊరివాళ్ళందరూ జాలిపడేవారు. గంగ ఏడుపుకు మేర లేదు.


ఇలాటి తిరుగుడులో ఒక్కొక్కసారి, పరాయి వాళ్ళ గడ్డివాములూ, అవ్వీ తగలబెడుతూ వచ్చేవారు. ఆ నష్టపడినవాళ్ళు, ఎప్పుడైనా పరిహారం ఇమ్మంటే, కొడుకులు త్రాచుపాముల్లా బుస్సలు కొట్టేవారు. మీ తాతగారే సర్ది కొంత ఇప్పించీ, అపుడపుడూ ఇప్పించకుండానూ సమాధాన పరిచేవారు. మళ్ళీ ఒక్కొక్కప్పుడు చేతుల్లో ఏది ఉంటే అది దానాధర్మాలు చేస్తూండేవారు. ఈ మతిలేని చేష్టల ఉధృతం అమావాస్యకూ, పౌర్ణమికీ మరీ ఎక్కువయ్యేది. అన్నలు తండ్రిని అప్పుడే తిట్టడమూ, అపుడపుడు కొట్టబోవడమూ, వదినలు భోజనం పెట్టకపోవడమూ జరుగుతూండేవి.

# పున్నమి మసకలు

( 8 వ పేజీ తరువాయి)

పాపం గంగ "పిన్నిగారూ, పౌర్ణమీ అమావాస్య వస్తూందంటే భయంగా ఉంది. మానాన్న ఏం కష్టపడతారో,ఏ దేవుళ్ళకి మొక్కుకోను?" అంటూ నావద్ద ఏడ్చేదమ్మా.

ఇలా ఒకనాడు సందేవేళ, కొడుకులందరూ బస్తీ వెళ్ళారు, పెళ్ళికి. సోమరాజుగారు వచ్చి మీ తాతగారి వద్ద దాచిపెట్టిన తాళాల గుత్తి అడిగి పుచ్చుకుని వెళ్ళారు. తరువాత, ఓజాము వేళ మనస్సు నెమ్మదిలేక, ఏమైపోయాడో తాళాలు ఎవ్వరికిచ్చాడో అని, వాళ్ళింటికి వెళ్ళారు తాతగారు. వెళ్ళితే కంటబడ్డ దేమిటీ అంటే ఆయన గాదె ఖాళీచేసి దిగుతున్నారుట. చుట్టూ ఉన్న పల్లెటూరి వాళ్ళు గంపలతో ధాన్యం మోసుకెళుతున్నారుట. వాళ్ళు "మేం నిన్న గంజి త్రాగుతుంటే చూచి ఖామందులు అడిగారు. పంటలు పోయినాయి. బియ్యపు గింజలు లేవు అని చెప్పుకున్నాం బాబూ. నేను ధాన్యం ఇస్తా రమ్మన్నారు. వచ్చాం" అన్నారుట. నిజంగానే గాదె ఖాళీ. కొడుకులూ, కోడళ్ళూ బళ్ళమీద, పెళ్ళి నుంచీ వస్తున్నారట — వస్తూనే ఈవిషయం కళ్ళారా చూచారు. ఒళ్ళూ మీదు తెలియని కోపం వచ్చిందట వాళ్ళకు, మరి రాదటలే? మీ తాతగారు గనుక దగ్గర లేకపోతే, ఇంకా ఏమయి ఉండేదో ఊహించలేముగాని. ఏదో ఆయన భయాన్న అంతవరకూ ఆగింది.



'చక్రభ్రమణం'

చిత్రం—బి. శశి (నర్సాపూర్)

"రేపు ప్రొద్దున్నే బస్తీవెళ్ళి పోలీసువాళ్ళని తీసుకొచ్చి ఒప్పచెప్పేస్తాము" అనీ, "సర్కారుకు వ్రాసి వేస్తాము" అనీ ఉరుముతూ చుట్టూ చేరారట. "ఈ మనిషి ఊరువాళ్ళకి చేసే నష్టాలకు పరిహారాలు ఇవ్వడమూ, పైగా ఈయన మా పిల్లల నోళ్ళల్లో దుమ్ముకొట్టి ఉన్న ధాన్యం దానాధర్మాలు. పోలీసుని పిలవండి. ఈపీడ విరగడైతే చాలు" అని కోడళ్ళూ ముఖం మీదికొచ్చి అన్నారు. మీ తాతగారు ఎల్లాగో సమాధాన పరచి, చెయ్యి పట్టుకుని, నిమ్మళంగా ఆయన్ని నడిపించుకుంటూ తన భవంతిలోకి తీసుకెళ్ళారట. నిమ్మళంగా ఆయన గదిలోకి వెళ్ళాక, పెద్ద వయస్సేమో ఉయ్యాలలో కూచోబడిపోయారట. కూడా ఉన్న కొడుకులు తిట్టుకుంటూ సణుగుకుంటూ "ఈయన్ని రాత్రి అంతా స్వేచ్ఛగా వదిలితే, ప్రొద్దున్నలోపుగా ఇంకా ఎన్ని అఘాయిత్యాలు చేస్తాడో!" అని పండ్లు పటపటకొరుకుతూ ఇంట్లో ఉన్న పగ్గాలు, పెండ్లి బండ్లపగ్గాలూ తెచ్చి, ఉయ్యాల నాలుగు గొలుసుల చుట్టూ గుండ్రంగా వలలాగు అల్లేశారమ్మా — ఆయన ఉయ్యాలలో నించీ బయటికి రాకుండా.

అప్పుడాయన చూచారటగదా మీ తాతగారి వేపు ఒకచూపు. మీ తాతగారికి కడుపు కలచి నట్టయిపోయిందట. ఇహ చూడలేకపోయారట మీతాతగారు. తరువాత నాతో అన్నారు, ఇంట్లో "సృష్టిలో శైశవజీవకోటి అంతా అసహ్యంగా ఉన్నప్పుడు అల్లాగే చూస్తుందనుకుంటాను" అని కళ్ళు తుడుచుకున్నారు. ఏంచేయాలో మాకూ పాలుపోలేదు. ఇహను ఎదురుగుండా ఈ చిన్న ఇంట్లో గంగ తల్లడిల్లి పోతూంది. ఏమైనా సరే, చొరవ చేసుకుని పుట్టింటిలోకి వెళ్ళి, తండ్రిమీదపడి ఏడ్చి, తండ్రిని తెచ్చేసుకుందామా అనుకుందట. కాని నొప్పులు ఆరంభం అయినాయి. నాలెక్కప్రకారం నెలలు నిండలేదు. సరిగ్గా, మరి. అయినా గాని ప్రసవవేదన ఆరంభం అయింది. తండ్రి చెయ్యి ఎంత జబ్బులోనైనా వదిలేదిగాదాయె. అందుకని "నాన్న నాన్న" అని వక్కి అరచినట్టూ అరిచేది. ఆరాత్రి ఎల్లా గడిచిందోనమ్మా. ఈనాటికీ భయంకరమే ఆ రాక్షస రాత్రి. మా ఇద్దరి మనస్సులూ మాలో లేవు. గంగ దుఃఖం వినలేము, చూడలేము. నరక యాతనతోనైనా, స్వర్గసుఖాలతోనైనా కాలం గడుస్తూ ఉంటుందిగదమ్మా. నిలవదుగా! ఘడియలు జాములైనాయి. పున్నమిరాత్రి గడిచి పోతూంది.

తెల్లవారు జామునకి గంగ ప్రసవించింది— మృత శిశువు.

అంతే. ఆక్షణంలో, అకస్మాత్తుగా పెద్దగోల వినిపించింది. గంగ గదిలో అమ్మలక్కలందరూ వీధిలోకి పరుగెట్టారు — ఒక్కసారిగా. ప్రక్క గదిలో దిగులుగా కూచున్న భూషణం, దిగ్గున లేచి వచ్చాడు వీధిలోకి. గంగ అన్నలు ఒకటే



ఆత్రుత

చిత్రం—ఎన్. బాబూరావు (విజయవాడ-3)

పరుగుమీద పరిగెట్టుతున్నారు. వెనక పాలేళ్ళూ ఊరువాళ్ళూ వెంటాడుతున్నారు. భూషణానికి ఈ గందరగోళం ఏమిటో ఏమీ తెలియలే. తన మనస్సులో తన మామగారు ఎల్లా ఉన్నారో అని చటుక్కున భయం వేసింది. మొదట ఆయనను రక్షించాలి. అతనికింకేమీ తోచలే. వెంటనే ధైర్యం చేసుకుని ఒక్క పరుగున మామగారి ఇంట్లోకి వెళ్ళారు. గదిలో మామగారు లేరు, ఉయ్యాల తాళ్ళు తెంపేసి ఉన్నాయి. ఉసూరు మంటూ విషయమంతా విని బయటికి వచ్చేశాడు.

ఈ లోపుగా ఈ అమ్మలక్కలందరూ, గంగ వద్దకు వచ్చి "మీ నాన్న పారిపోతున్నాడుట. మళ్ళా వెళ్ళి ఏం కొంపదీస్తారో అని మీ అన్నలు తీసుకొచ్చి సర్కారులో ఒప్పజెబుతామని కూడా పరుగెడుతున్నారు — పట్టి తీసుకురావడానికి. పాపం! ఎంత బ్రతుకు బ్రతికిన మహరాజుకి ఎటువంటి గతి పట్టిందో చూడండి! ఏకాలానికి ఏమోగదా!" అని దీనంగా గంగచుట్టూ చేరి అన్నారు. గంగ మాట్లాడలేదు. ముఖంలో మనం చూడలేని బాధా, దుఃఖమూ అలుముకు పోయి నాయి. నోరు తెరిచి ఏదో అనబోయింది. మాట రాలేదు — బయటికి. అల్లా, చంపలవెంట కన్నీళ్ళు ధారగా జారుతున్నాయి.

కొంచెం సేపట్లో, కోపంతోనూ, దుఃఖం తోనూ, ముఖం ఎర్రబారి, భూషణం అంగలు వేసుకుంటూ లోపలికి వచ్చాడు. వస్తూనే "చూచారా ఏం జరిగిందోనూ, ఏం గాభరా జరి గిందోనని, వాళ్ళింటికి పరిగెట్టి తిన్నగా ఆయన గదిలోకి చక్కా వెళ్ళా. ఆయన ఏమైపోతున్నారో వీళ్ళు కొడుతున్నారో, తిడుతున్నారో అని నాకూ గాభరాలో ఏమీ తోచలే. వీళ్ళ వదినలు చెబితే, ఇహ చేసేదేముందని నేను వెళ్ళి వెతుకుదామని, బయటకొస్తున్నాను. వీళ్ళ పెద్దన్న ఆయన్ని తరిమి తిరిగి వస్తున్నాడు. గుమ్మంలో నన్ను చూచాడు.అంతే 'ఎవ్వడా నివ్వు? ఎందుకొచ్చావు? మాకొంపకి నివ్వే శని. ఎవ్వరి నడిగి లోపలి కొచ్చావు? నడువు ముందు బయటికి. గుమ్మం తొక్కనక్కర్లే నివ్వు' అని ఏకధాటిగా అన్నా డండీ" అని చెప్పి భార్యతో గుమ్మంలోనుంచీ మళ్ళా చెప్పాడు. ఆవిడ బదలు చెప్పలే. అల్లాగే ఏడుస్తూండిపోయింది. అంతే మేము తిరిగి వక్కాణిస్తేకూడా చేతితో సైగచేసింది, గొంతు చూపించుకుంటూ, మాట రావడంలేదని. ఆ పురిట్లో ఏమైందో మేమెరుగం. ఆరోజుల్లో ఈ వసతు లేవీ? ఈ డాక్టర్లు ఏరీ? పల్లెటూరి పురుడాయె. పైగా ధర్మాస్పత్రికైనా వెళ్లదా మనేంత శ్రద్ధ ఎలా వస్తుంది? అందరి మన స్సులూ సోమరాజుగారి మీదే ఉందే? ఇంతకూ చికిత్సకు గంగ ఒప్పుకోవద్దూ! తిండి తీర్థాలే శ్రద్ధలేదాయె.

ఒక్క గంట సేపట్లో, వాళ్ళన్నలు గంగ ఇంటి మీదికి వచ్చారు. వాళ్ళు సోమరాజుగారి గదిలోకి వెళ్లేటప్పటికి, ఇనపపెట్టె తెరిచి ఉందట ఉయ్యాల ప్రక్కన. అందుకని "మతిలేక ఆ ముసలాడు క్రింద పడేసిన తాళాలు తీసి పెట్టె తెరిచి ఉంటావు. లేదా, ఆ తాళాలు నీదగ్గరే దాచాడో ఇన్నాళ్ళూ. అవ్వికాస్త పట్టుకుని—మేము అట్లా పరుగెట్టేటప్పటికి ఇంట్లో దొరబడి ఇనపపెట్టె తెరిచేశావు. సమయం చక్కగా చూచుకుని ఆ నగల పెట్టె కాస్తా కాజేశావు— ఇనప పెట్టెలోనుంచీ? తక్షణమే ఇచ్చెయ్యి. లేకపోతే పోలీసుకు చెబుతాం. ఆ నగలు మావిన్నివి. అందులో సగం మా అమ్మవి కూడాను. నీకు *ఏమాత్రమూ హక్కులేదు. తైట బడెయ్య*" అని బెదిరించారు. అప్పుడు మీతాతగారు ఎంతో కష్టం మీద సమాధాన పరచగలిగారు. "అబ్బా యిలూ, మీరంతా తెల్లవారకముందే, ఆయన్ని పొలాల వెంట తరుముకు పోతుంటే, ఎవ్వరూ ఇంట్లో లేరుగదా అనీ, ఉన్నా ఎవ్వరి గాభరాలో వాళ్లే ఉన్నారు గదా అనీ తెలుసుకుని, దొంగ లెవ్వరైనా ప్రవేశించి, అక్కడే ఆయన మతిలేక పడేసిన తాళాలు పెట్టి, పెట్టె తెరిచి నగలు అపహరించి ఉండవచ్చుగా. ఊరునిండా దొంగలు తిరుగుతున్న విషయం అందరికీ తెలిసిందేగదా! ఇల్లా గందరగోళంగా ఆపదలో ఉన్న ఇండ్లు వాళ్ళకి వడ్డించిన విస్తర్లేనాయె. వీళ్ళెందుకు చంపుతారు? పైగా, వాడి ఇంట్లోగాని, వంటి మీదగాని ఆ సొత్తు దొరకలేదాయె. వీడు తీసి నట్టూ సాక్ష్యం ఏది?" అని ఎంతో కష్టంమీద సమాధానపరిచారమ్మా. అయినా వాళ్ళమాత్రం సమయంకోసం వేచుకుని ఉన్నారు. "ఎక్కడో ఆ నగలు దాచాడు. ఏనాటికైనా అవ్వి బయట పడకపోతాయా" అని పిడికిళ్ళు చూపించారు.

ఇహనదమ్మా మొదలు, గంగ మూగితనానికీ చెప్పలేని నరకానికిన్నీ.

అలా పారిపోయిన సోమరాజుగారు తిరిగిరాలేదు.

తరువాత కొన్నాళ్ళు, సోమరాజుగారు ఎక్క డెక్కడో పల్లెటూళ్ళ పొలిమేరలలో, పొలాలలో, బస్తీ వీధులలోనూ తిరుగుతూన్నట్టూ వదం తులు పుట్టినాయి. రంగుల వ్యాపారస్థులు చూచి నట్టూ ఆనవాళ్ళు చెప్పారు. ఒంటిరాయి బంగారు పోగులూ, మాసి చినిగిపోయిన గుడ్డలూ, చంకలో చినిగిపోయిన గుడ్డల మూట పట్టుకు తిరుగుతున్నారట. ఒడ్డూ పొడుగూ కచ్చితంగా ఆనవాళ్ళు చెప్పారు. ఇంకేం చెప్పనూ? గంగ ఏడుపుకు వర్ణనలేదు. మరీ పౌర్ణమీ, అమా వాస్య వస్తూంటే, అక్కడాయన ఏమైపో తున్నాడో అని కుమిలి కుమిలి ఏడ్చేది. చూడలేక పోయేవాళ్ళ మమ్మా.

మరుసటి ఏడాది అమ్మాయిని అత్తవారిం టికి వదిలిపెట్టి రావడానికి జనార్దన తాతగారు బయలుదేరారు. అల్లుడు ఫారెస్టు పనిగదా, *చింతలపూడి అడివిప్రక్కకి బదిలీ చేశారు. తాత* గారు అక్కడకి వెళ్లి చేరిన మధ్యాహ్నం, అల్లుడు గారి ప్రక్కింటాయన అన్నారట "అయ్యా, మీ ఏరుపాలెం పెద్దమనిషి ఒకాయన, పాపం మతిచెడ్డది. మహాబ్రతికినవాడల్లే ఉంది. ఒకొ క్కప్పుడు సవ్యంగానే మాట్లాడతారు. ఎపుడు మతి చెదిరిపోతుందో తెలియదు. ఇప్పటికి ఆరేడు నెలల నుంచీ ఈ ప్రాంతాల్లోనే ఉంటు న్నాడు; అడివిలోపల ఉంటున్నట్టూ చెబుతారు. ప్రతి రాత్రీ ఊళ్ళోకి వస్తారు. అదేమిటో మా ఇంటికే వస్తుంటారు. సోమరాజుగారని పేరు చెప్పారు. పాపం వాళ్లవాళ్లకి చెప్పండి. మా ఇంటోనే భోజనం చేస్తారు. ఈ సాయం త్రం మీరు వచ్చారని చెబుతాను" అన్నాడట. మీ తాతగారికి సంతోషమూ, దుఃఖమూ పొంగుకు వచ్చినాయట. "వస్తే వెంటనే నన్ను పిలవండి" అని అన్నారుట మీ తాతగారు. ఆ రాత్రి భోజనాలవేళకు, మళ్లీ ఆ ప్రక్కిం టాయన వచ్చి, "మిమ్మల్ని పిలవడానికి మదురు ప్రక్కకి వచ్చానండి. సోమరాజుగారు భోజనం చేస్తున్నారు అరుగుమీద. నా కేక మీకు విన బడలే. వీధివేపు వద్దామని మళ్లా అరుగువైపు వచ్చాను. అంతే. ఆయన విస్తరు వదిలేసి వెళ్లిపోయారు. పాపం అప్పటికప్పుడే మతి చెదిరినట్టుగా ఉంది. అక్కడికీ చెప్పాను. మీ ఊరునుంచీ ఒకాయన వచ్చారు ఈ ప్రక్కింట్లో ఉన్నారు. పిల్చుకువస్తా ఉండమన్నాను కూడాను" అన్నారుట. ఆ మరునాడూ రాలేదు భోజనానికి, ఒక వారం చూచారు రాలేదు. ఇంతట్లో మీ తాతగారికి ఆ విషజ్వరం రావ డమూ అదీ అయ్యిందా. ఆయన మళ్లా లేచే టప్పటికి ఒక నెల పట్టింది, నడకనించీ. వెంటనే తాతగారూ, అల్లుడూ, ప్రక్కింటా యనా కలిసి అడివిలోపలికి ఆయనను వెతు క్కుంటూ పోయారట. అక్కడ మేకలను మేపేవారూ, పుల్లలు కొట్టేవాళ్లూ, ఆయన సాధారణంగా ఉండే గుట్టలోకి దారి చూపిస్తూ వెంట వెళ్లారట. కొంత దూరాన్న ఉండంగానే "ఇహ మేము రాం బాబోయ్. అదిగో పెద్ద పులి! ఆయన ఉండే గుట్టలోనే పడుకుంది. ఇదే ఈ మధ్య పారిపోయి ఇటు వచ్చింది, మను *ష్యుల్ని తింటోంది అనీ, భద్రం అన్నారు* అందరూ. ఇహ మేం రాం. ఆయన్ను ఇదే తిన్నాది బాబోయ్!" అని గాభరాగా నిలబడిపోయారట దారి చూపించేవాళ్లు. ఇంతలో అడివిలో పెను

# పున్నమి మసకలు

కెళ్లేవాడు ఒకడు, "ఈ పులి ఒక నెలనించీ ఇక్కడే ఉందండి. ఇంతకుముందు ఆ గుహలో ఒక పెద్దాయన పండుకుంటూండేవారు. పగలూ రాత్రికూడా. ఇదే తినేసి అక్కడే ఉందండీ, మళ్లీ ఎవ్వరైనా వస్తారేమోనని. మేమంతా అల్లాగే ముందరే అనుకున్నాం. ఏనాడు ఇది ఇక్కడికి వచ్చిందో ఆనాడే ఆయన్ని కాజేసింది" అని అన్నాడట. "ఈ ప్రాంతాల్లో ఇంకా మేము ఆఫీసుపని మొదలెట్టలేదండీ. లేకపోతే మా ఫారెస్టు పనివాళ్లు బందోబస్తుగా తిరుగుతూ ఉందురు. ఈ పులి ఇక్కడికి వచ్చే ఉండేది కాదు" అని అల్లాడన్నారట. విదానించి చూస్తే దాని ముందు ఎముకలూ అవ్వీ ఉన్నాయట. తాతగారికి మతిపోయినట్లయిపో యిందట. ఇహను తిరిగి రాబోతున్నారట. ఆయన కాళ్లదగ్గర తుప్పుపట్టిన తాళాల గుత్తి నేలమీద ఇసకలో కనిపించిందట. ఆ తాళాలుమట్టుకు పట్టుకువచ్చారు, ఇంటికి.

ఈ సంగతి ఊళ్లో తెలియగానే కొడుకులు, ఏదో మొదట కాస్త జాలిపడ్డారేమోగాని వెంటనే భూషణంమీదికి లేచారు. "ఆ మతిలేని ముసలాడు, ఆ రాత్రే పెట్టితెరిచి ఉంచాడు. ప్రొద్దున్న వీడికి అమాంతంగా చేత నగలపెట్టె చిక్కించుకోడం మహ సుళువైంది" అని ఒకడూ, "మమ్మల్ని పెళ్లికెళ్లనిచ్చి, జనార్దనయ్యగారి దగ్గరనించీ తాళాలు తెచ్చి ఇనపపెట్టె తెరిచి, నగలపెట్టె వీడికీ, గాదెలో ధాన్యం ఊరువాళ్లకీ పంచి ఇచ్చాడయ్యా. అది కాస్తా దాచేసి, ఏమీ ఎరగనట్టూ తెల్లవారి పరామర్శకు వచ్చాడు మా ఇంటికి వీడు" అని ఒకడూ, తిట్టారు.

ఈ సంగతి తెలిశాక, ఆరు మాసాలవరకూ మనలో లేదు గంగ — వాళ్ల నాన్న పోయారన్న మాట విని.

తరువాత నిమ్మళంగా భూషణం మనుష్యులలోకి తెచ్చాడు. వాళ్ల కుటుంబం అల్లాగే బీదగా నడుస్తూంది. భూషణం, బస్తీలో దొరికినపుడల్లా ఏపనిపడితే ఆ పని చేసి భత్యాలు ఇంటికి తెచ్చి ఇల్లు గడుపుతున్నాడు. జరుగుబాటు మహాకష్టంగానే ఉండేది.

గంగ మనస్సులో ఏమేమి ఆలోచనలు తిరుగుతూండేవో, హృదయంలో ఎంత ఆవేదన పొంగుతూండేదో మనకేం తెలుసు? చెప్పడానికి నోరు లేదుగా, నోరు మూగాయె. ఏవేళా ఏడుస్తూ తన గుమ్మంలోనుంచీ అడ్డత్రోవకేసి నడిదిబ్బకేసి తదేకదృష్టితో అల్లా గంటలతరబడీ చూస్తూ ఉండిపోయేది. గంగమ్మతల్లి నీడ లేకుండా నడిదిబ్బమీద నిలుచునే ఉండేది.

రెండేళ్లకి, భగవత్కృపవల్ల, గంగ తిరిగి గర్భవతి అయింది. "పొన్నపండులాంటి కొడుకు పుడతాడమ్మా. మీ నాన్నగారి పేరే పెట్టు" అని ఓదార్చేవాళ్లం.

నెలలు నిండినయి, గంగకు. అన్నల ద్వేషాలు ఏమీ తగ్గలేదు. "ఎప్పటికైనా వీడు ఎత్తికెళ్లిన నగలు కరిగించుకుని పొలాలూ తోటలూ కొనకపోతాడా? ఎన్నాళ్లు ఎవ్వరివద్ద దాచిపెట్టి ఉంచుతాడో చూస్తాం" అని మీసాలు మెలేస్తూండేవారు.

ఆనాడు శుక్లచతుర్దశి. ఆ రోజంతా మూగి బాధ అనుభవించింది గంగ. ఆ రాత్రి కూడా గడిచింది. తిరిగి తెల్లవారుజాము ఘడియలు వచ్చినాయి. గంగ సుఖప్రసవమైంది — మగశిశువు, మేమంతా అనుకున్నట్టే. సాక్షాత్ సోమరాజుగారే.


పిల్లాడు పుట్టాడు. అంతే. "మానాన్న" అంది, గట్టిగా, గాభరాగా. మేమంతా నివ్వెరపోయాము. మూడు సంవత్సరాల మూగి నోరు పలికింది. "పిల్లాడు పుట్టిన అదృష్టమేమో!" అన్నారు అమ్మలక్కలందరూ. అవతల గదిలోకి వంగి "మాట వచ్చిందయ్యా" అని అరిచారు, అందరూ ఆనందాశ్చర్యాలతో.

"మానాన్న" అంది గంగ ఇంకా గాభరాగా. "మీ నాన్నే. కొడుకుని కళ్ళారా చూడనైనా చూడలేదు ఇంకాను. అప్పుడే ఎంత ఆశ!" అని సరసమాడింది మంత్రసాని. గంగ వెర్రిగా కళ్ళతోనే వెతుకుతూ "మానాన్న" అంటూనే ఉంది.

ప్రక్క గదిలోనుంచీ భూషణం వంగిచూచి "ఏమిటే?" అన్నాడు ప్రేమతో, కృతజ్ఞతతోనూ.

"మానాన్న వచ్చాడండీ" అంది తల అటూ ఇటూ మంచం మీదనే కొడుతూ, దీనంగా భర్తకేసి చూచింది. "పిన్నిగారూ, బయట చూడండి మానాన్న దగ్గు వినిపించింది. మానాన్న వచ్చాడు" అంది నాకేసి చూస్తూ. "ఇదేదో గాలి చేష్ట. మూడేళ్ళు నోరు లేకుండా చేసింది. ఇప్పుడు ఇల్లాంటి మాటలాడిస్తోంది. ఆయన పోయి రెండేండ్లు దాటిపోయె" అంది మంత్రసాని తలపంకిస్తూ.

అయినా, హరికేను లాంతర్లు పుచ్చుకుని భూషణమూ, నేనూ బయలుదేరాం. అమ్మలక్కలందరూ, పురిటింట్లో అన్నీ ఇవ్వీ చూస్తున్నారు.



వారాణసి

చిత్రం—మంటపాలవాసు (మద్రాసు—33)

మేము ఇంటి చుట్టూ తిరిగాం. గంగ గది కిటికీ సుమారుకు వచ్చాం. అక్కడ నేల దిమ్మెసా తక్కువ. కాస్త చెమ్మ ఎప్పుడూ; ప్రక్క 'గుంట' అక్కడికి దగ్గర. ఆ తడినేలలో పెద్ద అడుగులు కనిపించినాయి, లాంతరు వెలుగులో— అడుగులు ముందుకూ వెనక్కూ కూడా ఉన్నాయి. భూషణం గాభరా పడిపోయాడు. నాకూ ముచ్చెమటలు పోసినాయి. "మామయ్యగారి అడుగులేనండీ ఇవి. ఆ సాయంత్రం మతిపోయేటప్పుడు అడుగులు దిగబడ్డవని చెబితే, లాంతరుతో వెతికాము. ఈదారినే వచ్చారు, బస్తీనించీ. ఆరోజు అడుగులు ఇవ్వే— ఇల్లాగే ఉన్నాయి...." అన్నాడు. నాకూ అంతే ననిపించింది.

లాంతరు ఎత్తి ఎగిరి కిటికీ గుండా, ఇంట్లోకి ఈ సంగతి చెప్పబోయాడు భూషణం. కిటికీలో ఒక చింకి గుడ్డల మూట పెట్టి ఉంది. ఒక్క పరుగున లోపలికి వెళ్ళాం. ఆమూట భయంగా కర్రతో క్రిందికి త్రోశాం. 'టక్'న పెద్ద శబ్దంతో పడ్డది. ధైర్యం చేసుకుని భూషణం మూట విప్పాడు. లోపల మంచి గంధపు చందువా ఉంది. ఇక నేనూ ధైర్యం చేసుకుని ఆ చందువా తెరిచాను. గంగకి పెళ్ళికి పెట్టిన నగలన్నీ అందులో, చిన్నం ఎత్తుపోకుండా ఉన్నాయి. ఆనగల మీద కాయితం చుట్టే ఉంది, పురికోసతోకట్టి. గంగపేరులో వ్రాసిన ఉయిలునామా, అది. ఆ పెట్టె, ఆ సామాగ్రి నాకు పరిచయమే.

వెంటనే పరుగెట్టాం బయటికి, భూషణమూ నేనూ, మా వెనక అందరూ.

మా కళ్ళముందు నిమ్మళంగా కాళ్ళీడ్చుకుంటూ, ఎత్తుగా నడిచి పోతున్నారు, సోమరాజుగారు, పొలిమేరలలోకి. మేం పరిగెట్టాం. తనూ పరిగెట్టారు. తన కొడుకులే అనుకుని భయపడ్డారో! మేం పిలిచాం. ఆయన వినిపించుకోలేదు. మేము ఆనవాలే రాలేదు! పరాకుగా, నడుస్తూ మమ్మల్ని చూచి భయపడ్డారో, మూడు ఏండ్ల క్రితం కొడుకులు తరమడం, చటుక్కున వేళని బట్టి, జ్ఞాపకం వచ్చిందో, మాకేమీ ఈనాటికీ తెలియదమ్మా. ఆయన మా అలికిడికి వెనక్కి తిరిగి చూచి ఒక్క పరుగున, మరీ విసురుగా, నడిదిబ్బకేసి పరిగెట్టారు. ఆ చింతచెట్టు నీడ మరీ దట్టంగా పడుతూంది, దిబ్బమీద. ఆనీడ చీకటికడ్డంగా పరిగెట్టారు. అక్కడే గంగమ్మ తల్లి ఉంది.

వృద్ధాప్యంవల్లనో, జీవితాశయం ఈడేరిందనో, లేక, పరిగెట్టలేక ఏమైనా సరే అమ్మవారి పాదాలవద్ద వాలిపోదామనో, ఆ చింతచెట్టు చీకటికడ్డంగా అమ్మవారి వద్దకే పరిగెట్టారు. అమ్మవారి చుట్టూ బెట్టుగా పెట్టిన రాళ్ళమీద నించీ, తన బలువంతటితోనూ అమ్మవారిమీదికి వాలిపోయారు.

ఆ పడడంలో, అమ్మవారి ముఖం ఆయన కణతకి తగిలిందల్లే ఉంది. పెద్ద గాయం పడి, అమ్మవారిమీదకూడా కాస్త రక్తం అంటుకుంది.

# ఉత్తరాలు

( 2 వ పేజీ తరువాయి)

ముఖచిత్రాలు ఇంకా ఎన్నో వేస్తారని ఆశిస్తున్నాం.

—పి. వి. చలపతిరావు
(యలమంచిలి)

## అభివందనాలు

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దినదినాభివృద్ధి పొందించుటకు మీరు చేస్తున్న కృషికి నా అభివందనములు. ఈమధ్య అట్టమీద బొమ్మలు, ప్రకృతికి సంబంధించిన చిత్రములు చాల మనోహరంగా ఉండి నన్ను ఆనందపరచినవి.

మీరు ప్రచురిస్తున్న రెండు సీరియల్స్ మొదట్లో కొంచెం బాగులేకపోయినా, రానురాను బాగుండి, కాలక్షేపానికి ఫర్వాలేదనిపించుకుంటున్నాయి.

—పి. వి. ఎన్. రావు
(బందర్)

* * *

16—10—63 వ తేది సంచిక ముఖచిత్రానికి మిమ్ములను ఎంతగా అభినందించాలో చెప్పలేకుండా ఉన్నాను. ఈమధ్య కొన్నాళ్ళుగా ముఖచిత్రం విషయంలో మీరు ప్రవేశపెట్టిన మార్పు చాలా ప్రశంసనీయం.

—ఉరిమిరి అప్పలనరసింహం
(విజయనగరం—2)

* * * *

9 అక్టోబరు 1963 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉండి నన్ను ఎంతో ఆనందపరచింది. ఇటువంటి మంచి చిత్రములను ప్రచురించుచున్న ఎడిటరుగారిని అభినందించకుండా ఉండలేను.

—జి. పద్మారావు
(గుత్తెనదీవి)

* * *

9—10—63 వ తేది ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ముఖచిత్రం మధురమీనాక్షి ఆలయ దృశ్యం చూడ ముచ్చటగా ఉంది.

డాక్టర్ శ్రీహరిగారి చిరునామా తెలిపినందులకు మీకు నా ధన్యవాదములు.

—సత్యానంద్
(జగ్‌దల్‌పూర్)

## చల్లదనం

సుమలత జీవనకలశము
సుమనోహరమాయె చదువ; సుదతీమణియే
అమర కవీశుల మించెను;
కమలంబుల చల్లదనము కలుగదె చదువన్?

—కె. సుబ్రహ్మణ్యం
(కాళహస్తి)

* * *

సుమలతగారి 'జీవనకలశం' పాఠకులలో అధిక సంఖ్యాకుల హృదయాలను రంజింపజేస్తూ సాగుతున్నా, కొందరి అర్థంలేని విమర్శలకు గురి అవుతూన్నందుకు విచారిస్తున్నాను. వాస్తవం కాదని ఒక విమర్శ, శిల్పంలేదని మరొక విమర్శ—ఇలా ఎన్నో విమర్శల పరంపరలను చూస్తున్నాను.

వాస్తవానికి యోజనాల దూరంలో ఉన్న నవలల్లోని తీయని ఊహల్లో తేలియాడే ఆ పాఠక సోదరులు నిజజీవితాలను చిత్రించే నవలల్లోని సంఘటనలను వాస్తవదూరంగా ఉంటున్నాయని భ్రమించడం అలవాటయిపోయింది. అధునాతన నాగరికతా శిఖరాల నధిరోహించడంలో అడుగడుగునా పోటీలుపడి అర్రులు చాస్తున్న నేటి సమాజంలో జరుగలేనివంటూ ఉండవు. తమ దృష్టికి రానంతమాత్రాన అవి అవాస్తవాలనడం సబబుకాదు.

శిల్పం విషయంలోమాత్రం ఈ నవలకు ఒక నిర్దిష్టమయిన కథావస్తువు లేదన్నమాట నిజమే. కాని అంతమాత్రంతో మునిగిపోయింది మట్టుకేమీలేదు. ఒక విషయాన్ని లోకానికి తెల్పడంకోసం, ఆ విషయాన్ని ఆధారంగా తీసుకుని కథనల్లడం సాంఘిక నవలా సంప్రదాయం. అలాగే ఈ నవలకూడా ఒక విషయాన్నే కాకుండా బోలెడు విషయాలను కళ్ళకుకడుతూ సాగుతూంది. తమ సంతానానికి మహోజ్వల భవిష్యత్తు నేర్పరచాలన్న అర్థంలేని ఆశ, ఆలోచనలతో స్వయం నిర్ణయం చేసుకోగల యీడొచ్చిన పిల్లలను, బలవంతంగా వారి కిష్టంలేని జీవనమార్గాల్లోకి మళ్ళించే తల్లిదండ్రుల ప్రవర్తనకిది చుక్కానిపంటిది. పవిత్ర స్నేహామరాగాలకు నిలువుటద్దం. మాతానుతల మమకారానికి మార్గదర్శిని. ఇలా చెప్పుకుపోవాలంటే ఎన్నయినా ఉన్నాయి!

కథాగమనంకూడ చక్కగా, హృద్యంగా ఉంది. కొన్ని సందర్భాలలో వాస్తవ జగత్తులో ఉయ్యాల లూగించి హృదయాన్ని మెత్తని బాధకు గురి చేస్తూ సాగుతూంది.

## మీకు తెలుసా

## జవాబులు

1. ఏబెల్ యాన్సన్ టాస్మాన్ (1603–1659)
2. తాహితి.
3. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత యూరపు దేశాలకు అందజేసిన సహాయం; ఆ కార్యక్రమం రూపొందించిన జనరల్ మార్షల్ పేరుపెట్టారు.
4. చేతులు (హాండ్స్). ఒకచేయి అంటే నాలుగు అడుగులు.
5. సీనాయ్ పర్వతం మీద.
6. హానెబల్ (క్రీ. పూ. 247–183).
7. ఎంపరర్ పెంగ్విన్.
8. శాన్ ఫ్రాన్సిస్కో. ★

---

మేము పట్టుకుని లేవనెత్తేటప్పటికి స్పృహలేదు.

భూషణంగారి వసారాలో భద్రంగా పడుకోబెట్టాం.

గంగ "మా నాన్న. మా నాన్నని పిలవండీ" అంటూ ఏడుస్తూంది, లోపల. "అమ్మా, దెబ్బ తగిలింది. మతి ఇంకా రాలేదు" అని సముదాయించాం. "కొంచెం ఆగు అమ్మా" అని ఎంతో చెప్పాం.

ఆ పగలంతా చావు బ్రతుకుల మధ్య గడిచింది. ఊరు వాళ్ళంతా ఉసూరుమంటూ వచ్చారు—ప్రక్క ఊళ్ళవాళ్ళూ వచ్చిచేరారు. "ఎంతటి మహరాజుకి ఏమి తిప్పలు!" అంటూ కూచోబడిపోయారు.

లోపల గంగ మూలుగుతూ ఏడుస్తూంది.

సూర్యాస్తమయమైంది. సోమరాజుగారికి స్పృహరాలేదు, తిరిగి. మమకారాలూ, భయాలూ, ఉపాయాలూ, ఆలోచనలూ, వ్యథలూ, అన్నీ ఆరిపోయినాయి. ఎక్కడికెళ్ళినయ్యో! ఎలా అంతరించినయ్యో నమ్మా!

గంగ ఉండబట్టలేక, నిమ్మళంగా, నీరసంగా, గోడలు పట్టుకుని నడిచి వచ్చింది. గదిలోనుంచి. గుమ్మంలో నిలుచుని పండుకున్న తండ్రిని చూచింది.

సోమరాజుగారి చెయ్యి పట్టుకుని, నాడి చూస్తున్న భూషణం, ఆ చెయ్యి చటుక్కున వదిలేసి, కండువా నోట్లో పెట్టుకుని బావురుమన్నాడు. అందరూ వెక్కివెక్కి ఏడవసాగారు.

గంగ చూపులో ఏదీ సోకినట్టుగా లేదు. ఆ చూపులో ఉన్న ప్రపంచం, మనది కాదనిపించింది.

శిలా ప్రతిమలా, ఆకాశంకేసి చూచి, చేతులు జోడించి, దణ్ణం పెట్టింది. "భగవంతుడా!" అంది.

ఎదురుంగా, తూర్పున, పున్నమిచంద్రుడు పెద్దగా, ఎర్రగా, ఉదయిస్తున్నాడు. ★